బుధవారం
18-09-2024
# ముందడుగు
దినపత్రిక
సంపుటి: 1, సంచిక: 459 పేజీలు: 4 | ₹6
EPAPER.MUNDADUGU.COM
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచేయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..
Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com




ప్రధాని మోడీ గిఫ్టులు వేలం

మిగతా 2లో




ఢిల్లీకి మూడో మహిళా సీఎంగా అతిశీ

మిగతా 3లో



బండ్లగూడలో గణేష్ లడ్డూ రికార్డు ధర

మిగతా 4లో



ఆర్మీ అధికారుల పేరుతో ఫేక్ కాల్స్

మిగతా 5లో



## గంగమ్మ ఒడికి మహాగణపతి

### జయ జయ ధ్వానాల మధ్య నిమజ్జనం


**ముందడుగు హైదరాబాద్ :**

హైదరాబాద్ నగరంలోని ఖైరతాబాద్ మహా గణపతి నిమజ్జన ప్రక్రియ అంగరంగ వైభవంగా ముగిసింది. వేలాది భక్తుల జయ జయ ధ్వానాల మధ్య.. ఎన్టీఆర్ మార్గ్‌లోని నాలుగో నంబర్ క్రేన్ వద్ద బడా గణేశుడిని నిమజ్జనం చేశారు. అంతకుముందు ఉత్సవ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ప్రారంభమైన మహా గణపతి శోభాయాత్ర వైభవంగా సాగింది. మధ్యాహ్నానికి హుస్సేన్‌సాగర్ వద్దకు చేరుకుంది. ఈ శోభాయాత్రలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో శోభాయాత్ర మార్గంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

హరియాణా నుంచి
## అత్యధిక సైనికులు

### దేశాన్ని ఆదుకుంటున్న హరియాణా రైతులు

ఎన్నికల ప్రచార ర్యాలీలో అమిత్ షా



**ముందడుగు హరియాణా:**

హరియాణాలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలకు ప్రధాన రాజకీయ పార్టీలు ప్రచారం ముమ్మరం చేశాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా మంగళవారం లోహరులో జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీని ఉద్దేశించి ప్రసంగించారు. స్వాతంత్ర్యానంతరం హరియాణ నుంచే త్రివిధ దళాల్లోకి అత్యధిక సంఖ్యలో సైనికులు వచ్చారని అన్నారు. మనం ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకునే పరిస్థితుల్లో ఉండగా హరియాణ రైతులు దేశాన్ని ఆదుకున్నారని తెలిపారు.

మిగతా 2లో

ఢిల్లీ సింఎం పదవికి
## కేజ్రీవాల్ రాజీనామా

### లెఫ్టినెంట్ గవర్నర్‌కు రాజీనామా లేఖను అందజేత

**ముందడుగు ఢిల్లీ:**

దేశ రాజధాని ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా చేశారు. మంగళవారం సాయంత్రం లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను కలిసిన ఆయన తన రాజీనామా లేఖను అందజేశారు. ఆయనతో పాటు ఆప్ శాసనసభాపక్ష నేతగా ఎన్నికైన ఆతిశీ, ఇతర మంత్రులు సైతం ఉన్నారు. కేజ్రీవాల్ రాజీనామాను ఎల్జీ ఆమోదించాక..

మిగతా 2లో



కొంపలేం మునిగిపోవు..
## బుల్డోజర్ న్యాయం ఆపండి

### బుల్డోజర్ చర్యలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

**ముందడుగు జాతీయం:**

దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు విచారణలో ఉన్న నేరగాళ్ల ఇళ్లు, ప్రైవేటు ఆస్తులపైకి బుల్డోజర్లను నడిపించే విషయంలో బాధితులకు ఉపశమనం ఇవ్వడం, దేశస్థాయిలో మార్గదర్శకాల తయారీపై నేడు న్యాయస్థానం విచారణ చేపట్టింది.

మిగతా 2లో



ముందడుగు
బుధవారం, 18-09-2024, హైదరాబాద్

## హరియాణా నుంచి అత్యధిక సైనికులు

(మొదటిపేజీ తరువాయి)
హరియాణ రైతులు చెమటోడ్చి మనకు మిగులు ఆహార ధాన్యాలను అందించారని అన్నారు. ఇక ఒలింపిక్స్, పారాఒలింపిక్స్‌లో అత్యధిక మెడల్స్‌ను దేశానికి హరియాణ అథ్లెట్లు అందించారని వివరించారు. ఇక హరియాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి భంగపాటు తప్పదని కేంద్ర మంత్రి, హరియాణ మాజీ సీఎం మనోహర్ లాల్ ఖట్టర్ అన్నారు. కాంగ్రెస్‌తో పొత్తుకు ఏ పార్టీ ముందుకు రావడం లేదని చెప్పారు. రిజర్వేషన్లు, సిక్కులపై కాంగ్రెస్ నేతలు అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. హరియాణ సీఎం నయబ్ సింగ్ సైనీ నేతృత్వంలో రాష్ట్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## ఢిల్లీ సిఎం పదవికి కేజ్రీవాల్ రాజీనామా

### లెఫ్టినెంట్ గవర్నర్‌కు రాజీనామా లేఖను అందజేత

(మొదటిపేజీ తరువాయి)
త్వరలోనే ఆతిశీ కొత్త సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

ఆతిశీ క్యాబినెట్‌లో డిప్యూటీ సీఎం పదవి ఉండదని, ఆమె సెప్టెంబర్ 2627 తేదీల్లో జరిగే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉందని సమాచారం. ఆతిశీని తదుపరి సీఎంగా ఎంపిక చేయడంపై మంత్రి గోపాల్ రాయ్ మాట్లాడారు. "పరీక్ష కాలంలో ఆతిశీకి ఈ బాధ్యతలు అప్పగించాం. ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ఏజెన్సీలను దుర్వినియోగం చేస్తున్నారు. అలాంటి ప్రయత్నాలను ఆప్ భగ్నం చేసింది" అన్నారు.

## కొంపలేం మునిగిపోవు.. బుల్డోజర్ న్యాయం ఆపండి



(మొదటిపేజీ తరువాయి)
ఇప్పటికిప్పుడు 'బుల్డోజర్ న్యాయం' చేయడంపై సుప్రీం కోర్టు అసహనం వ్యక్తం చేసింది.

జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని బెంచ్ వాదనలు వినింది. అనధికారికంగా జరిపే ఇటువంటి బుల్డోజర్ చర్యలను అక్టోబర్ 1వ తేదీ వరకు నిలిపివేయాలని పేర్కొంది. మరోవైపు వీటిని ఆపితే ఆక్రమణల తొలగింపు ఆలస్యమవుతుందన్న ప్రభుత్వ భయాలను కొట్టిపారేసింది. "వచ్చే విచారణ తేదీ వరకు మీ చర్యలను ఆపమని మేం కోరినంత మాత్రాన కొంపలేం మునిగిపోవు" అని జస్టిస్ బి.ఆర్.గవాయ్, కె.వి.విశ్వనాథన్ వ్యాఖ్యానించారు. ఈ నెలలో ఇప్పటికే రెండు సార్లు వివిధ రాష్ట్రాలు చేపట్టిన 'బుల్డోజర్ చర్యల'పై న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ప్రాక్టీస్‌ను హీరోయిజంగా చూపే యత్నం చేయవద్దని హెచ్చరించింది. తమ అనుమతులు లేకుండా ఎటువంటి కూల్చివేతలు చేపట్టొద్దని తేల్చిచెప్పింది. దీనిపై ఎన్నికల కమిషన్‌కు కూడా నోటీసులు జారీ చేస్తామని వెల్లడించింది.

## ప్రధాని మోడీ గిఫ్ట్‌లు వేలం

### మీకు కావాలంటే ఇలా వేలంలో పాల్గొనండి



**ముందడుగు జాతీయం:**
భారత ప్రధాని నరేంద్ర మోడీ.. మంగళవారం 74వ పుట్టినరోజు జరుపుకోనున్నారు. మోడీ బర్త్ డే సందర్భంగా.. బీజేపీ శ్రేణులు దేశవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. మరోవైపు.. కేంద్ర ప్రభుత్వం కూడా మోడీ పుట్టిన రోజు సందర్భంగా కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధాని మోడీకి.. వచ్చిన 600 బహుమతులను వేలం వేయాలని నిర్ణయించింది. అనేక సందర్భాల్లో ప్రధానమంత్రికి వచ్చిన గిఫ్ట్‌లను వేలం వేయనున్నట్లు కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ వెల్లడించారు. ఆన్‌లైన్ ద్వారా వేలం వేయనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి వరకు ఈ వేలం నిర్వహించనున్నారు. ఈ బహుమతులను ఈవేలం ద్వారా విక్రయించనున్నట్లు అమ్మనున్నారు. ఈవేలం మోడీ బర్త్‌డే సందర్భంగా మంగళవారం ప్రారంభం కానున్నట్లు తెలిపారు. నమామి గంగే నిధికి విరాళాలు అందజేస్తూ ఈవేలంలో పాల్గొనాలని కేంద్రం తెలిపింది. ఇలా ప్రధాని మోడీ బహుమతులను వేలం వేయడం 2019లో ప్రారంభించారు. తమకు ఇష్టమైన బహుమతి కోసం ప్రజలు ఈ వేలంలో పాల్గొనవచ్చని కేంద్రం పేర్కొంది. ఈ ఆన్‌లైన్ వేలం అక్టోబర్ 2వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ వేలంలో పాల్గొనేందుకు అధికారిక వెబ్‌సైట్ అయిన https://pmmementos.gov.in ద్వారా పేర్లు నమోదు చేసుకుని పాల్గొనవచ్చని తెలిపింది. వీటిలో విశిష్ట కళాఖండాలు, వివిధ ఆలయాల నమూనాలు, హిందూ దేవతలు, పారాలింపియన్ల షూస్ ఉన్నాయి.

## ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు

### భారత విదేశాంగశాఖ వెల్లడి



**ముందడుగు జాతీయం:**
భారత ప్రధాని నరేంద్ర మోడీ అమెరికా పర్యటన ఖరారైంది. ఈ నెల 21 నుంచి 23వ తేదీవరకు అగ్రరాజ్యంలో ప్రధాని మోడీ పర్యటించనున్నట్లు భారత విదేశాంగశాఖ వెల్లడించింది. సెప్టెంబరు 21న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆధ్వర్యంలో విల్మింగ్టన్ వేదికగా నిర్వహించనున్న నాలుగో 'క్వాడ్ సదస్సు'లో పాల్గొననున్నారు. వాస్తవానికి ఈ ఏడాది క్వాడ్ సదస్సు భారత్‌లో నిర్వహించాల్సింది. అయితే.. అగ్రరాజ్యం విజ్ఞప్తి మేరకు 2025లో నిర్వహించేందుకు అంగీకరించింది. క్వాడ్‌లో భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్‌లు సభ్యదేశాలుగా ఉన్నాయి. సెప్టెంబరు 22న న్యూయార్క్‌లో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రధాని మోడీ ప్రసంగించనున్నారు. కృత్రిమ మేధ, బయోటెక్నాలజీ, సెమీకండక్టర్లు తదితర రంగాల్లో సహకారాన్ని పెంపొందించేందుకుగాను ప్రముఖ సంస్థల సీఈవోలతో భేటీ కానున్నారు. భారత్ అమెరికా సంబంధాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న ప్రముఖులతోనూ సంభాషించనున్నారు. సెప్టెంబరు 23న న్యూయార్క్‌లోని ఐరాస జనరల్ అసెంబ్లీలో 'సమ్మిట్ ఆఫ్ ది ఫ్యూచర్'నుద్దేశించి ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా అనేక మంది ప్రపంచ నేతలతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందని విదేశాంగశాఖ తెలిపింది.

ముందడుగు
బుధవారం, 18-09-2024, హైదరాబాద్

# ఢిల్లీకి మూడో మహిళా సీఎంగా అతిశీ

## 43 ఏళ్లకే సీఎంగా బాధ్యతలు చేపట్టనున్నారు



**ముందడుగు ఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీకి మూడో మహిళా ముఖ్యమంత్రిగా ఆప్ పార్టీ నుంచి అతిశీ బాధ్యతలు చేపట్టనున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి గతంలో షీలా దీక్షిత్, బిజెపి నుంచి సుష్మా స్వరాజ్ ముఖ్యమంత్రులుగా సేవలందించారు. అంతేకాదు అత్యంత పిన్న వయసులోనే ఢిల్లీ ముఖ్యమంత్రిగా చేపట్టనున్న మహిళ కూడా అతిశీనే కావడం గమనార్హం ఢిల్లీకి 15 ఏళ్ల పాటు వరుసగా షీలా దీక్షిత్ ముఖ్యమంత్రిగా సేవలందించారు. 1998 నుంచి 2013 వరకు మూడు పర్యాయాల పాటు ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. ఆ తర్వాత కాంగ్రెస్‌ను అధికారానికి దూరం చేసి ఆప్ గద్దెనెక్కింది. జాతీయ రాజకీయాల్లోకి రాక ముందు 1998లో సుష్మా స్వరాజ్ కేవలం 52 రోజుల పాటు సేవలందించారు. షీలాదీక్షిత్ సీఎంగా బాధ్యతలు చేపట్టే నాటికి ఆమె వయసు 60 ఏళ్లు. సుష్మాస్వరాజ్ 46 ఏళ్లకే సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. అతిశీ మాత్రం 43 ఏళ్లకే సీఎంగా బాధ్యతలు చేపట్టనున్నారు. అతి తక్కువ వయసులోనే ఈ పగ్గాలు అందుకోనున్నారు.






# తాను నిత్యం పనిచేసే సీఎంను ఫామ్‌హౌస్ సీఎం కాదు

## తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

**ముందడుగు తెలంగాణ :** తాను ప్రజలకు నిత్యం పనిచేసే సీఎం అని ఫామ్‌హౌస్ సీఎం కాదని రేవంత్ రెడ్డి అన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రస్థానంలో అత్యంత కీలకమైన రోజు అని అందుకే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లోతైన ఆలోచన చేసి ఈరోజును "ప్రజా పాలన దినోత్సవం"గా జరపాలని నిర్ణయించినట్టు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన ప్రజా పాలన దినోత్సవంలో రేవంత్ రెడ్డి పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర ప్రజలందరికీ ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. "ప్రజా పాలన దినోత్సవం.. ఈ నిర్ణయం నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష. వారి ఆలోచన. నాటి తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి. ఈ నిర్ణయాన్ని ఎవరైనా తప్పుపడితే వారిది స్వార్థ ప్రయోజనమే అవుతుంది తప్ప ప్రజాహితం కాబోదు" అని అన్నారు.

సెప్టెంబర్ 17 ను కొందరు వివాదాస్పదం చేయడం మంచిది కాదని అన్నారు. జయ జయహే తెలంగాణ గీతాన్ని.. రాష్ట్ర అధికారిక గీతంగా, రాష్ట్ర సంక్షిప్త నామాన్ని టీజీగా మార్చడం, సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ, గద్దర్ పేరిట అవార్డులు, మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరును ఖరారు చేయడం వంటి తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనానికి చేపట్టిన అనేక చర్యలను ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు.

# సుప్రీంకోర్టు ఆదేశాలు హైడ్రాకు వర్తించవు

## హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందన

**ముందడుగు హైదరాబాద్:** సుప్రీంకోర్టు బుల్డోజర్ న్యాయాన్ని ఆపాలంటూ ఇచ్చిన ఆదేశాలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. ఆ ఆదేశాలు హైడ్రాకు వర్తించవని తెలిపారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని నేరస్థులు, నిందితుల ఆస్తుల కూల్చివేతలకు మాత్రమే సుప్రీం ఆదేశాలు వర్తిస్తాయన్నారు. చెరువులు, నాలాలు, ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించి నిర్మించిన వాటిని మాత్రమే హైడ్రా కూల్చివేస్తుందని స్పష్టం చేశారు.

నేరస్థులు, నిందితులకు సంబంధించిన ఎలాంటి ఆస్తుల జోలికి హైడ్రా వెళ్లడం లేదని రంగనాథ్ పేర్కొన్నారు. బహిరంగ స్థలాలు, రైల్వే ఆస్తులు, నీటి వనరుల ఆక్రమణల తొలగింపులో తమ ఆదేశాలు వర్తించవన్న సుప్రీంకోర్టు ఆదేశాలను రంగనాథ్ గుర్తుచేశారు. హైడ్రా కూల్చివేతలపై ఇటీవల పలువురు న్యాయస్థానాలను ఆశ్రయించారు. హైడ్రా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అక్రమంగా కూల్చివేతలు చేస్తుందని, న్యాయం చేయాలంటూ కోర్టును ఆశ్రయించడం చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో తాజాగా సుప్రీంకోర్టు ఆదేశాలు రావడంతో రంగనాథ్ స్పందించారు. ఆ ఆదేశాలు హైడ్రాకు వర్తించవని స్పష్టం చేశారు.







# బండ్లగూడలో గణేష్ లడ్డూ రికార్డు ధర

## కీర్తి రిచ్మండ్ విల్లాస్‌లో రూ.1.87 కోట్లు

ముందడుగు హైదరాబాద్:

వినాయకుడి వద్ద ప్రత్యేక పూజలందుకున్న లడ్డూలు రికార్డు స్థాయిలో వేలం పాటలో దక్కించుకుంటున్నారు. హైదారాబాద్ బండ్లగూడలో గణేష్ లడ్డూ రికార్డు ధర పలికింది. ఏకంగా రూ.1.87 కోట్లు పలికింది. కీర్తి రిచ్మండ్ విల్లాస్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన వినాయక విగ్రహం వద్ద లడ్డూ వేలం నిర్వహించారు. 25 మంది ఓ గ్రూప్‌గా ఏర్పడి ఈ లడ్డూను రికార్డు స్థాయిలో వేలంపాట పాడి దక్కించుకున్నారు. కీర్తి రిచ్మండ్ విల్లాస్ వారు రూ.1.26 కోట్ల రూపాయలకు గణేష్ లడ్డూను సొంతం చేసుకున్నారు.

### గతేడాది కూడా రికార్డు ధరకే...

బండ్లగూడలోని కీర్తి రిచ్మండ్ విల్లాస్‌లో గత ఏడాది కూడా రికార్డు ధరకు లడ్డూను సొంతం చేసుకున్నారు. గతేడాది రూ.1.26 కోట్ల రూపాయలకు గణేష్ లడ్డూను సొంతం చేసుకున్నారు.



# మయన్మార్‌లో భారీ వర్షాలు.. 226 మంది మృతి

## మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం

ముందడుగు జాతీయం:

మయన్మార్ భారీ వర్షాలతో అతలాకుతలమైంది. ఈ క్రమంలోనే యాగీ తుపాను విరుచుకుపడటంతో వరదలు పోటెత్తాయి. పెద్దఎత్తున కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనల్లో దాదాపు 226 మంది మృతి చెందారు. మరో 77 మంది గల్లంతైనట్లు అధికారిక మీడియా వెల్లడించింది. లక్షలాది మంది ప్రజలు తమ ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. దాదాపు 6.30 లక్షల మంది ప్రకృతి విపత్తుతో ప్రభావితమయ్యారని.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఐరాస తెలిపింది. మయన్మార్‌లో ఇటీవలి సంవత్సరాల్లో అత్యంత దారుణమైన వరదలు ఇవేనని పేర్కొంది.

ఇప్పటికే అంతర్యుద్ధంతో సతమతమవుతున్న మయన్మార్‌లో వరదల ధాటికి.. వేల ఎకరాల్లో పంట నాశనమైంది. రాజధాని నేపిడావ్ ప్రాంతం తీవ్రంగా ప్రభావితమైంది. దాదాపు ఐదు లక్షల మంది ప్రజలు ఆహారం, తాగునీరు, సరైన ఆశ్రయం లేక అల్లాడుతున్నట్లు ఐరాస తెలిపింది. రహదారుల వంటి మౌలిక సౌకర్యాలు దెబ్బతినడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని పేర్కొంది. ఈ క్రమంలోనే తమ దేశాన్ని ఆదుకోవాలని అక్కడి సైనిక పాలక వర్గం జుంటా విదేశీ సాయాన్ని అభ్యర్థించినట్లు తెలుస్తోంది. వియత్నాం, థాయ్‌లాండ్, లావోస్‌లలోనూ యాగీ తుపాను విధ్వంసం సృష్టించింది. ఒక్క వియత్నాంలోనే 300 మందిని బలితీసుకుంది.

# గత సంవత్సరం 98% మిరప రైతులు గ్రాసియాను ఉపయోగించారు

ముందడుగు హైదరాబాద్:

మిరప పంటల కోసం 98% మిరప రైతులు గ్రాసియాను ఉపయోగించారని, ఇది మిరప పంటలకు సమర్థవంతమైన చీడ పీడల నివారిణి అని గోద్రెజ్ అగ్రోవెట్ లిమిటెడ్ మంగళవారం వెల్లడించింది. దక్షిణాదిలోని మిరప మార్కెట్‌లలో నిర్వహించిన సర్వే ఫలితాలను విడుదల చేస్తూ, 57% మంది రైతులు 1535 రోజులు మధ్య గ్రాసియాను ఉపయోగించారని కంపెనీ వెల్లడించింది.

"మిరప పంటలో 1525 రోజుల దశలో గ్రాసియా ను పిచికారీ చేస్తే తామర పురుగు ( త్రిప్స్) నుంచి దీర్ఘకాలిక నియంత్రణను అందిస్తుంది, రైతులు గ్రాసియాను ముందుగానే ఉపయోగించడంలో విలువను కనుగొంటున్నట్లు పరిశోధనలు స్పష్టంగా చూపిస్తున్నాయి. అదనంగా, మేము సర్వే చేసిన రైతులులో 71% మంది గత సంవత్సరం 2 సార్లు కంటే ఎక్కువగా గోద్రెజ్ అగ్రోవెట్ వారి గ్రాసియా ను ఉపయోగించారు. గ్రాసియా అనేది రైతులకు అత్యంత ప్రజాదరణ పొందిన మరియు గోటుబ్రాండ్ అని ఇది పునరుద్ఘాటిస్తుంది" అని గోద్రెజ్ ఆగ్రోవెట్ క్రాప్ ప్రొటెక్షన్ బిజినెస్ సీఈఓ రాజవేలు ఎన్.కె అన్నారు.



ముందడుగు
బుధవారం, 18-09-2024, హైదరాబాద్



## లంచ్, కాఫీ బ్రేక్‌లలో శృంగారంలో పాల్గొనండి

### దేశ ప్రజలకు రష్యా ప్రభుత్వం ఆదేశాలు

ముందడుగు జాతీయం:

రష్యాలో జననాల రేటు పడిపోతుండటంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన పుతిన్ సర్కార్.. ప్రజలకు కీలక సూచన ఇచ్చింది. లంచ్, కాఫీ బ్రేక్‌లలో శృంగారంలో పాల్గొనాలని వింత సూచన చేసింది. ఇప్పుడు ఇదే తీవ్ర చర్చకు దారి తీస్తోంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తాజాగా చేసిన వ్యాఖ్యలు.. ఆ దేశంలో చర్చకు దారితీశాయి. రష్యాలో జననాల రేటు రోజురోజుకూ పడిపోతుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేసిన పుతిన్.. సంతానోత్పత్తిని పెంచాలని సూచించారు. ఇందులో భాగంగానే రష్యా ప్రజలు.. పనివేళల్లో భోజన విరామం, కాఫీ విరామాల్లో శృంగారంలో పాల్గొనాలని పేర్కొన్నారు. తద్వారా దేశ జనాభా రేటు క్షీణతను తగ్గించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రష్యాలో స్థిరమైన జనాభా కోసం సంతానోత్పత్తి రేటు ఒక మహిళకు 2.1గా ఉండగా.. ఆ దేశంలో ప్రస్తుతం 1.5గా మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలోనే పుతిన్ ఈ సూచన చేశారు. అయితే రష్యాలో జనాభా పెరుగుదల ఆవశ్యకతను గతంలో పుతిన్ గుర్తు చేశారు.

రష్యా ప్రజల సంరక్షణ అనేది తమ దేశ జాతీయ ప్రాధాన్యత అని పుతిన్ వెల్లడించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా 10 లక్షలకు పైగా యువకులు రష్యాను వీడినట్లు తెలుస్తోంది. ఓవైపు.. సంతానోత్పత్తి రేటు తగ్గడం, మరోవైపు.. యువత దేశాన్ని వీడటంతో పుతిన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## ఆర్మీ అధికారుల పేరుతో ఫేక్ కాల్స్

### వాట్సాప్ డీపీగా ఆర్మీ అధికారుల ఫోటోస్

### నమ్మితే మాత్రం నిలువునా దోచేస్తారు



ముందడుగు క్రైం:

దేశాన్ని రక్షించే ఆర్మీ అధికారుల పేరు చెప్పుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. పగలనకా రాత్రనకా.. దేశ రక్షణలో ప్రాణాలను సైతం అర్పించుకునే ఆర్మీ అధికారుల పేర్లను వాడుకుని.. సైబర్ నేరాలకు తెరతీశారు కేటుగాళ్లు. ఆర్మీ అధికారులమంటూ సామాన్యులకు వాట్సప్ కాల్స్ చేస్తూ.. డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. పైగా.. అమాయకులను నమ్మించేందుకు డీపీలో ప్రధాన మంత్రితో కలిసి ఆర్మీ అధికారులు తీసుకున్న ఫొటోలను డీపీలుగా పెట్టుకుంటున్నారు. దీంతో.. సామాన్యులు నిజమేనని నమ్మి సైబర్ కేటుగాళ్ల ఉచ్చులో పడి మోసపోతున్నారు. కాగా... ఇలాంటి ఫేక్ కాల్స్ తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువగా వస్తున్నాయని.. టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు.

సైబర్ నేరాలపై ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో ప్రజలకు అవగాహన కల్పించే సజ్జనార్.. ఇప్పుడు ఈ కొత్త తరహా మోసం గురించి పోస్ట్ చేసి.. నెటిజన్లలో కొంత అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు. ఆర్మీ అధికారులమంటూ సామాన్యులకు వాట్సాప్ కాల్స్ వస్తున్నాయని.. ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సజ్జనార్ సూచించారు. తనకు తెలిసిన ఒకరికి... 7015591204 అనే నెంబర్ నుంచి వాట్సాప్ కాల్ వచ్చిందని తెలిపారు. అయితే.. అటు నుంచి మాట్లాడిన వ్యక్తి.. తాను ఇండియన్ ఆర్మీలో మేజర్ ర్యాంక్ అధికారినంటూ పరిచయం చేసుకున్నట్టు తెలిపారు.

బాధితున్ని సులువుగా నమ్మించేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో ఆర్మీ అధికారులు తీసుకున్న ఫోటోను వాట్సాప్ డీపీగా పెట్టుకున్నట్టు తెలిపారు. అయితే.. ఫోన్ చేసిన వ్యక్తి, బాధితుని క్రెడిట్ కార్డు వివరాలు చెప్పాలంటూ అడిగినట్టు సజ్జనార్ తెలిపారు. ఇలాంటి ఫేక్ కాల్స్.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఎక్కువగా వస్తున్నాయని సజ్జనార్ హెచ్చరించారు. ఇలాంటి మోసపూరిత కాల్స్‌కి స్పందించవద్దని.. ప్రతిఒక్కరు అప్రమత్తగా ఉండాలని సూచించారు. ఈమేరకు తన అధికారిక ట్విట్టర్‌లో పోస్ట్ పెట్టారు.

## రీల్స్ పిచ్చితో రోడ్డుపై శవంలా యువకుడు..

### యువకుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

ముందడుగు ఉత్తరప్రదేశ్:

సోషల్ మీడియాలో పేరు తెచ్చుకోవడానికి 23 ఏళ్ల ముకేశ్ కుమార్ నడిరోడ్డుపై అచ్చం శవంలా పడుకున్నాడు. అలా శవంలా నడిరోడ్డుపై ఉంచిన అతని స్నేహితులు ఇన్‌స్టాలో రీల్ కోసం దానిని వీడియో తీయడం ప్రారంభించారు. నడిరోడ్డుపై శవంలా పడి ఉండటతో అంతా నిజంగా చనిపోయారనే భావించి విషాదంగా మొహం పెట్టి నిలుచున్నారు. వీడియో తీయడం ముగిసిన వెంటనే పగలబడి నవ్వుతూ ముకేశ్ ఒక్కసారిగా లేచి కూర్చున్నాడు. దీంతో అప్పటివరకు ఆ యువకుడు చనిపోయాడని భావించిన ఆ జనం ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఈ సంఘటన యూపీలోని కస్‌గంజ్ జిల్లాలో జరిగింది. మరోవైపు నిజంగానే శవం అనుకుని భావించిన ఆ యువకుడి చుట్టూ ప్రజలు భారీగా తరలివచ్చారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మరోవైపు కొందరు మిత్రులు వీడియోను వైరల్ చేశారు. దీంతో అది కాస్తా వైరల్‌గా మారింది. నెటిజన్లు ఈ వీడియోపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై అదనపు పోలీసు సూపరింటెండెంట్ రాజేష్ భారతి స్పందించారు. కోల్డ్ స్టోరేజీ ప్రాంతంలో ఈ సంఘటన జరిగిందని ఓ యువకుడు శవంలా రోడ్డుపై పడుకుని వీడియో తీసినట్లు తెలిపారు. మరోవైపు శవం వీడియోలు సైతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ వ్యవహారంతో అక్కడ



గందరగోళం నెలకొందని ఏఎస్పీ తెలిపారు. ఈ ఘటనకు కారణమైన ముఖేశ్ కుమార్‌ను అరెస్ట్ చేశామని... అతనిపై తగిన చర్యలు తీసుకుంటామని అదనపు పోలీస్ సూపరింటెండెంట్ రాజేశ్ భారతి వెల్లడించారు.